క్లుప్తంగా

నేడు విగ్రహావిష్కరణ

తాళ్లరేవు: పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన యోధుడు స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆదివారం పి.మల్లవరం పంచాయతీలో ఆవిష్కరించనున్నారు. స్థానిక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆయన తనయుడు, యువ నాయకుడు వంగవీటి రాధాకృష్ణ ఆవిష్కరిస్తారని ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాపు నేతలు హాజరు కానున్నట్టు పి.మల్లవరం రంగా అభిమాన సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రంగా అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరుతున్నారు.

శ్రమదానం



ఆస్పత్రి ప్రాంగణంలో ప్రతిజ్ఞ చేస్తున్న శంకరరావు, ఇతర వైద్యులు, నర్సులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది, అభివృద్ధి కమిటీ సభ్యులు స్వచ్ఛత కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వైద్యులు శ్రమదానం చేసి ఆస్పత్రి ప్రాంగణలో చెత్తా చెదారాన్ని తొలగించారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, డాక్టర్ చంద్రశేఖర్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజ రాజేశ్వరి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధి,సామాజిక కార్యకర్త వలవల శివరావుతో పాటు నర్సులు పాల్గొని శ్రమదానం చేశారు.

అమలాపురంలో స్వచ్ఛత ర్యాలీ

అమలాపురం టౌన్: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో స్వచ్ఛత ర్యాలీ శనివారం జరిగింది. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడులు అతిథులుగా పాల్గొని ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, కౌన్సిలర్లు బొర్రా వెంకటేశ్వరావు, యేడిద శ్రీను, వెంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కర్రి దత్తుడు, మాజీ కౌన్సిలర్లు తిక్కిరెడ్డి నేతాజీ, ఆశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు

అమలాపురం టౌన్: అమలాపురానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైనట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. పట్టణానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేస్తున్నట్టు సంబంధిత శాఖ కార్యదర్శి కోన శశిధర్ జీవో ఎంఎస్ నంబరు 64 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కళాశాలకు అమలాపురం రూరల్ మండలం పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్థలాన్ని కేటాయించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఎం.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు శనివారం పరిశీలించారు. అమలాపురానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని తమ విద్యార్థి సంఘం కొన్ని దశాబ్దాల నుంచి చేసిన అనేక ఉద్యమాలు, పోరాటాల వల్లే ఇప్పుడు ఆ కళాశాల సాకారమవుతోందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు తెలిపారు. అమలాపురంలో పేద విద్యార్థులు అధిక ఫీజులతో ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని తిరుపతిరావు చెప్పారు.

బస్సు షెల్టర్ ప్రారంభం



బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న త్రినాథరావు కుటుంబ సభ్యులు

అమలాపురం రూరల్: పేరూరుపేట 216 జాతీయ రహదారి జంక్షన్‌లో కలిగినీడి త్రినాథరావు కుటుంబ సభ్యులు బస్సు షెల్టర్‌ను నిర్మించారు. త్రినాథరావు ప్రథమ వర్ధంతి జ్ఞాపకారంగా శనివారం ఆయన కుమారులు సుబ్బారావు, సత్యనారాయణ, మాచరబాబు ఈ బస్సు షెల్టర్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడతూ జాతీయ రహదారిలో ఎండల్లో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు నీడ కోసం షెల్టర్‌ను నిర్మించామని తెలిపారు. నాలం సూరిబాబు, త్రినాథరావు, కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పోస్టులను భర్తీ చేయాలి

యానాం: సీనియర్ అధికారుల పోస్టులకు వెంటనే భర్తీ చేయాలని శనివారం పుదుచ్చేరి ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సమాఖ్య గౌరవ అధ్యక్షుడు శేషాచలం ప్రకటన విడుదల చేశారు. పుదుచ్చేరిలో అత్యున్నత స్థాయి సివిల్ సర్వీస్ అధికారులు, పుదుచ్చేరి సివిల్ సర్వీసెస్ అధికారులు, జాయింట్ సెక్రటరీలు, డిప్యూటీ సెక్రటరీలు, అండర్ సెక్రటరీలు, డిపార్ట్‌మెంట్ కమిషనర్ల అధికారులు ఉంటారని అయితే వీటిని ప్రభుత్వం భర్తీ చేయడం లేదన్నారు. ప్రస్తుతం పుదుచ్చేరిలో 94 సీనియర్ అధికారుల పోస్టుల్లో 24 ఖాళీగా ఉన్నాయని, దీంతో ఒకే అధికారి అనేక విభాగాలకు డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, అండర్ సెక్రటరీలుగా పనిచేస్తున్నారన్నారు. చీఫ్ సెక్రటరీకి అయితే నాలుగు నుంచి అయిదు విభాగాలకు అదనపు బాధ్యతలు అప్పగించారన్నారు. దీంతో పరిపాలనా కార్యకలాపాలు స్తంభించిపోతున్నాయని సమస్యలు పరిష్కారం కావడం లేదని తక్షణం సీఎం జోక్యం చేసుకోవాలని కోరారు.

వీడని ముంపు

- ఐలెండ్‌ను వదలని వరద
- నీటిలో నానుతున్న ఇళ్లు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఐ.పోలవరం: ఐలెండ్‌ను వరద ముంపు వీడలేదు. భారీ వరద ముప్పు తప్పినా.. ఎగువన ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద వరద తగ్గుతున్నా మండలంలో మాత్రం ముంపు కొనసాగుతూనే ఉంది. కేశనకుర్రు పంచాయతీ పరిధి పాగాకులంక, పల్లెగూడెంలకు వరద ముంపు పెరిగింది. మత్స్యకారులు అధికంగా ఉండే ఈ ప్రాంతలో మూడు అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు వాహనాలు వదిలి కాలినడకన ప్రయాణాలు చేస్తున్నారు. అలాగే మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద వరద నీరు పుష్కర్ ఘాటు వద్ద ఉన్న నివాస గృహాలు మరింత ముంపులో చిక్కుకున్నాయి. స్థానికంగా ఉన్న స్నానాల రేవు మొత్తం వరదలో ఉంది. ఇళ్ల మధ్యకు వరదనీరు రావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అన్నంపల్లి అక్విడెక్టు వద్ద వరద తగ్గలేదు. పాత, కొత్త అక్విడెక్టులు వరద నీటిలో సగానికి పైగా మునిగాయి. రాఘవేంద్రవారధి, ఎదుర్లంక వారధిల వద్ద వరద ఉరకలు వేస్తోంది. అమావాస్య కారణంగా సముద్రం తెన్ని పెట్టడంతో నదీపాయలు శివారు మండలాలైన ఐ.పోలవరంతోపాటు కాట్రేనికోన, అల్లవరం మండలాల్లో ముంపు పెరిగిందని స్థానికులు చెబుతున్నారు.

శాంతించిన వరద

అల్లవరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద తీవ్రత తగ్గడంతో బోడసకుర్రు వద్ద మత్స్యకార కాలనీ వరద నుంచి తేరుకుంది. మూడు రోజులుగా వరద నీటిలో చిక్కుకున్న ఇళ్లు ఒక్కొక్కటిగా వరద నుంచి బయటపడుతున్నాయి. శనివారం ఉదయం వరద తీవ్రత ఎక్కువగా ఉన్నా మధ్యాహ్నం నుంచి వరద తీవ్రత బాగా తగ్గింది. ఆదివారం ఉదయానికి వరద సాధారణ స్థాయికి వస్తుందని అధికారులు అంచాన వేస్తున్నారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ

బోడసకుర్రు పల్లిపాలెంలోని మత్స్యకార కాలనీ వరదలో చిక్కుకున్న వరద బాధితులకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేయకుండా, భోజనాలు, నీళ్లు అందించలేని స్థితిలో ఉన్న అధికార యంత్రాంగాన్ని ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ అధికారులు ప్రశ్నించారు. పార్టీ నాయకులతో కలసి బాధితుల్ని పరామర్శించి, వారి ఆవేదనను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి వరద తగ్గే వరకు భోజనాలు, నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన అధికారులు శనివారం ఉదయం వరద నీటిలో ఉన్న బాధితులకు బోటుపై వెళ్లి భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు.



ఐ.పోలవరం మండలం మురమళ్ల రాఘవేంద్ర వారిధి వద్ద ఇళ్ల మధ్యకు చేరిన నీరు



బోడసకుర్రు మత్స్యకార కాలనీలో తగ్గిన వరద తీవ్రత



పల్లెగూడెంలో వరద నీటిలో నడిచి వస్తున్న స్థానికులు

హెచ్చరిక బోర్డును దాటి వెళ్లరాదు



వరద నీటి ఉధృతిని పరిశీలించి భక్తులకు సూచనలు ఇస్తున్న ఎస్సై అవినాష్

కాట్రేనికోన: గోదావరికి ఉగ్రరూపంతో ప్రవహిస్తున్నందున కుండలేశ్వర స్వామి దర్శానానికి వచ్చే భక్తులు పుష్కర ఘాటు వద్ద హెచ్చరికల బోర్డులు దాటి వెల్లవద్దని, స్నానం చేసేందుకు వాటర్ ట్యాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని కాట్రేనికోన ఎస్సై అవినాష్ పేర్కొన్నారు. కుండలేశ్వరం పుష్కర ఘాట్ వద్ద వరద ఉధృతిని, ఘాట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. గోవదారి వరద నీరు దిగువ ప్రాంతాలకు చేరుతోంది. వరద నీరు పుష్కరఘాట్ వద్ద రావిచెట్టును నందీశ్వరుని తాకింది. నడవపల్లి, పల్లంకుర్రు రేవు, బలుసుతిప్ప ప్రాంతాలకు వరద నీరు చేరడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. పల్లంకుర్రు రేవు ప్రాంతంలో నీరు ఇల్లు చుట్టూ నీరు చేరడంతో ఏటి గట్టుకు వచ్చేశారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం

ఆర్డీవో మాధవి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

అమలాపురం టౌన్: మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదామని అమలాపురం ఆర్డీవో, ఇన్‌చార్జి డీఆర్వో కొత్త మాధవి పిలుపునిచ్చారు. వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ డివిజన్‌లోని మండలాల తహసీల్దార్లు, సీఐలు, ఉత్సవ కమిటీల ప్రతినిధులతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. మనం చేసే పూజల వల్ల తోటి వారికి, సమాజానికి మేలు జరిగినప్పుడే మనకు నిజమైన ముక్తి లభిస్తుందన్నారు. ఆడంబరాలకు పోయి ప్రకృతికి హాని కలిగించే ఖరీదైన రంగుల ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారైన విగ్రహాలు వినియోగించి పర్యావరణానికి హాని కలిగించొద్దని అన్నారు. యువకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నాయకులు ముఖ్యంగా మహిళలు మట్టి విగ్రహాలనే ప్రోత్సహించాలని ఆర్డీవో సూచించారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీలు విధిగా సీసీ కెమెరాలతో స్వీయ నిఘా ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఎల్‌పీవో బుజ్జిబాబు, అమలాపురం పట్టణం, రూరల్ పోలీస్ సర్కిళ్ల సీఐలు పి.వీరబాబు, డి.ప్రశాంత్‌కుమార్, వివిధ మండలాల తహసీల్దార్లు, ఉత్సవ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రెవెన్యూ, పోలీస్ అధికారులు, ఉత్సవ కమిటీల ప్రతినిధులు

చంద్రబాబు మోసాలను అందరికీ తెలపాలి

- వైఎస్సార్ సీపీ నాయకులు
- గ్రామాల్లో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం

తాళ్లరేవు: ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని చంద్రబాబు పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసగించారని, ఆయన మోసాలను ఇంటింటికీ వివరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. శనివారం మండల పరిధిలోని నీలపల్లి, జార్జిపేట గ్రామ పంచాయతీలలో పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిశీలికుడు మాతా మురళి నేతృత్వంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నీలపల్లి కమ్యూనిటీ హాలులో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పందిరిపల్లి రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్‌లు ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. అనేక హామీలిచ్చి సూపర్‌సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా పాత పథకాలకు కొత్తపేర్లు పెట్టి తూతూ మంత్రంగా ఇస్తున్నారన్నారని విమర్శించారు. చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. భవిష్యత్‌లో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేస్తుందని ధీమాగా చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు మోకా మధుబాబు, బొంతు మోహన్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు, నాయకులు రేవు నాగేశ్వరరావు, రెడ్డి సతీష్, కొప్పిశెట్టి వెంకట్, కాలా వెంకటరమణ, వుంగరాల లక్ష్మణరావు, వెంటపల్లి నూకరాజు, పంపన రామకృష్ణ, పోతుల రత్నకుమారి, కోరుకొండ కిరణ్‌కుమారి, రిటైర్డ్ జెడి పెట్ల సూర్యనారాయణ రాజు, పేర్ని ఆదినారాయణ మూర్తి, రెడ్డి నాగేశ్వరరావు, పందిరిపల్లి అమర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నీలపల్లిలో మ్యానిఫెస్టో పత్రాలను చూపుతున్న నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



యనమదల ఇందిర



దాసరి సత్య

ఉప్పలగుప్తం: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని గొల్లవిల్లి, భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైట్టు పాఠశాల పీడీలు కామన మధుసూదన్‌రావు, గొలకోటి ఫణీంద్ర శనివారం తెలపారు. గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న యనమదల ఇందిర వెయిట్ లిఫ్టింగ్ 75 కేజీల విభాగంలో ఎంపికయ్యిందని, ఈమె ఈ నెల 24 నుంచి తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పీడీ ఫణీంద్ర తెలిపారు. భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాసరి సత్య 800 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించిందని, ఈమె అమరావతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పీడీ మధు తెలిపారు. ఈ విద్యార్థులను పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్లు గుర్లింక సూర్యనారాయణమూర్తి, వాలా సత్యనారాయణమూర్తి, హెచ్‌ఎంలు జి.కనకదుర్గ, ఎస్.నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఐదడుగుల మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

అమలాపురం టౌన్: జిల్లా వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గుత్తుల భాను ప్రకాష్ అమలాపురంలో 5 అడుగుల ఎకో ఫ్రెండ్లీ గణేశ్ (మట్టి) విగ్రహాలను శనివారం ఉచితంగా అందజేశారు. వినాయక చవితి పండుగకు పేదలు ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో విగ్రహాలను పంపిణీ చేసినట్టు జిల్లా అధ్యక్షుడు భాను ప్రకాష్ అన్నారు. స్థానిక గ్రాండ్ పార్కు వద్ద జరిగిన కార్యక్రమంలో విగ్రహాలను పంపిణీ చేశారు. అనంతరం భాను ప్రకాష్‌ను జిల్లా గణేష్ ఉత్సవాల కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రతినిధి బులుసు జగదీష్, జిల్లా ఉత్సవ కమిటీ ప్రతినిధులు గొవ్వాల రాజేష్, గొవ్వాల అచ్యుతరామయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేసే విగ్రహాలతో జిల్లా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భాను ప్రకాష్, కమిటీ ప్రతినిధులు

పైపులైన్ లీకుతో చేపల మృత్యువాత

తాళ్లరేవు: యానాం ఐలాండ్ నంబరు-3లో ఇటీవల జరిగిన ఓఎన్‌జీసీ పైప్‌లైన్ లీకు కారణంగా అనేక చేపలు మృత్యువాత పడ్డాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా సముద్ర, గోదావరి తీర ప్రాంతంలో చేపలు తేలిపోయాయని వాపోయారు. ఈ సందర్భంగా గాడిమొగ రామాలయం వద్ద పంచాయతీ పరిధిలోని గాడిమొగ, లక్ష్మీపతిపురం, చినవలసల, పెదవలసల గ్రామాలకు చెందిన మత్స్యకార గ్రామపెద్దలు, యువకులు సమావేశమై చమురు సంస్థల నిర్వాకంగా కారణంగానే మత్స్యసంపద చనిపోతుందని చర్చించారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు కామాడి మాతరాజు, కొక్కిలిగడ్డ లోకేష్, మల్లాడి ధర్మారావు తదితరులు మాట్లాడుతూ ప్రమాదం జరిగినప్పటి నుంచి తీరప్రాంతంలో 8 అడుగుల లోతులో ఉండే చేపలు, పీతలు తేలిపోయి మృత్యువాత పడుతున్నాయన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దీనిపై చమురు సంస్థలు స్పందించి మత్స్యకారులకు తగిన న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎంపీ హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుల దృష్టికి తీసుకువెళతామన్నారు.



గాడిమొగలో విలేకర్లతో మాట్లాడుతున్న మత్స్యకార నాయకులు

కన్నబాబుకు పరామర్శ



మాజీ మంత్రి కన్నబాబును పరామర్శిస్తున్న పార్టీ నాయకులు

ఉప్పలగుప్తం: పితృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబును కాకినాడ ఆయన నివాసంలో పలువురు నాయకులు శనివారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, ముమ్మిడివరం మండల పార్టీ అధ్యక్షుడు జగతా బాబ్జి, రాయపురెడ్డి నాగు, కొర్లపాటి కోటబాబు తదితరులు మాజీ మంత్రి కన్నబాబును పరామర్శించి సానుభూతిని తెలియజేశారు.

పరిమిత వనరులతో ఎన్నెన్నో విజయాలు

కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు సర్వేశ్వర శర్మ

అమలాపురం రూరల్: పరిమితి వనరులతో అపరిమితి విజయాలు సాధిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తల సాంకేతిక నైపుణ్యం ఒక అద్భుతం అని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. బండారులంకలోని విజడమ్ పాఠశాలలో శనివారం జరిగిన కోనసీమ సైన్స్ పరిషత్ 2921వ మహాసభలో శర్మ అంతరిక్షంలో జరిగే ఎన్నో అద్భుతాలు గురించి విద్యార్థులకు వివరించారు. గత అర్ధ శతాబ్ది కాలం నుంచి భారత రోదసి ప్రయోగాల పరంపర కొనసాగుతోందన్నారు. ఆర్యభట్ట నుంచి గగన్ యాన్ వరకు అనంతమైన అవకాశాలు అనే ఇవృత్తంతో రెండో జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుతున్నారని అని అన్నారు. భారతదేశ మొట్టమొదటి ఉపగ్రహం ఆర్యభట్ట ఒక చిన్న ఇంట్లో కూర్చుని డిజైన్ చేసి రష్యా నుంచి 1975 ఏప్రిల్ 19న ప్రయోగించారు. ఇప్పుడు గగన్ యాన్ ప్రాజెక్టులో రాబోయే రెండేళ్లలో భారతీయ వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపి భద్రంగా తిరిగి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. యాక్సిఎం-4 మిషన్లో భూమికి 400 కిలోమీటర్లు ఎత్తులో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 18 రోజులు గడిపిన భారతీయ వ్యోమగామి శుభాం శుక్లా భూమికి క్షేమంగా తిరిగి వచ్చాడని,ఇతని యాత్ర గగన్ యాన్‌కు సుగమమైందని ఇస్రో శాస్త్రవేత్తలు అన్నారు. రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ గిడుగు నాగేశ్వరరావు మాట్లాడుతూ' చంద్రుడిపై అడుగుపెట్టిన నాలుగో దేశంగా, చంద్రుని దక్షిణ ధృవం చేరుకున్న మొదటి దేశంగా భారత్ అవతరించిందని చెప్పారు. స్కూల్ కరస్పాండెంట్ కేకేవీఎస్ ప్రకాష్‌రావు, ప్రకాష్ రావు, జీవీఎస్ శర్మ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైన్స్ పరిషత్ అధ్యక్షుడు సర్వేశ్వర శర్మ

గోదావరి వరదలతో 4,257 మంది నిరాశ్రయులు

అమలాపురం రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గోదావరి వరదలు మూలంగా జిల్లాలో 1,291 కుటుంబాలు ముంపుబారిన పడడంతో 4,257 మంది నిరాశ్రయులయ్యారని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. వరద ఉధృతి తగ్గుముఖం పట్టినట్టు ఆయన వెల్లడించారు. ఇప్పటి వరకు మూడు కుటుంబాలలో పది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, 7 పునరావాస కేంద్రాలు సిద్ధం చేశామని తెలిపారు. 1,098 గృహాలు ముంపు బారిన పడ్డాయని ముంపు బాధితుల తరలింపునకు 23 బోట్లు సిద్ధం చేశామని, 282 మందికి సహాయక చర్యలు చేపట్టామన్నారు. శనివారం 400 ఆహార ప్యాకెట్లను, 20 లీటర్ల సురక్షిత తాగునీటిని 810 టిన్నులు సరఫరా చేశామన్నారు. కేవలం అమలాపురం డివిజన్‌లో బోడసకుర్రు పల్లిపాలెం, లంక ఆఫ్ తానేలంక, పాసర్లపూడి, పాసర్లపూడి లంక, చింతపల్లిలంక, కూనలంక, గురజాపులంక, లక్ష్మీదేవి లంక, కొండుకుదురు గ్రామాలు ముంపు వారిని పడ్డాయన్నారు. వరద ఉధృతి తగ్గ ముఖం పట్టట్టిందని ముంపు తగ్గేందుకు అవకాశాలు ఉన్నట్టు ఆయన వెల్లడించారు.



బాధితులకు ఆహార ప్యాకెట్లను అందిస్తున్న ఉద్యోగులు

టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం స్ఫూర్తిదాయకం

అమలాపురం రూరల్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి కే మాధవి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి పురస్కరించుకుని డీఆర్వో మాధవి అధికారులతో కలిసి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ నేతలు ఎంత మంది ఉన్నా ప్రజాభిమానాన్ని గెలుచుకున్న కొద్ది మంది నేతల్లో టంగుటూరి ప్రకాశం పంతులు ఒకరని, ఆయన ఎన్నటికీ చిరస్థాయిగా నిలుస్తారన్నారు. ఆంధ్రరాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పని చేసిన ఈయన, రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఆయన పేరును ప్రకాశం జిల్లాగా నామకరణం చేయడం తెలుగు వారందరికీ గర్వకారణమన్నారు.అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ సిబ్బందితో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి సిబ్బందితో డీఆర్వో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌లు నాగ లక్ష్మమ్మ ఏసుబాబు, రమణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో మాధవి, అధికారులు

డిప్యూటీ ఎంపీడీవో మంగాదేవి మృతి



మంగాదేవి(ఫైల్)

అమలాపురం రూరల్: స్థానిక డిప్యూటీ ఎంపీడీవో బడుగు మంగాదేవి(59) శనివారం మృతి చెందారు. గత కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకు వెళుతుండగా శనివారం తెల్లవారు జామున మార్గమధ్యలో తుది శ్వాస విడిచారు. మలికిపురం డిప్యూటీ ఎంపీడీఓగా పని చేస్తూ బదిలీపై అమలాపురం డిప్యూటీ ఎంపీడీవోగా సేవలందిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన మంగాదేవి భట్నవిల్లి, కామనగరువుతో పాటు పలు మండలాల్లో విధులు నిర్వర్తించారు. ఈవోపీఆర్డీగా పదోన్నతి పొందిన ఆమె అమలాపురం డివిజన్‌లో పనిచేశారు. ప్రభుత్వం పదోన్నతలు కల్పించడంతో అమలాపురం డిప్యూటీ ఎంపీడీవోగా మంగాదేవి సేవలు అందిస్తున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేస్తున్నారు. ఆమెకు సడన్‌గా ఆరోగ్యం క్షీణించడంతో 20 రోజులు నుంచి వైద్యం పొందారు. మంగాదేవి మృతిదేహాన్ని ఈదరలపల్లిలో ఆమె నివాసవానికి తీసుకువచ్చారు. జిల్లా కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రుద్రరాజు సూరపరాజు, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రెడ్డి శిరిష, శ్రీనివాస్, పలువురి ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు మృతిదేహన్ని సందర్శంచి పూలమాలలువేసి నివాళులు అర్పించారు.

కూరాటి కుటుంబానికి పితాని పరామర్శ



గోవలంకలో నరసింహమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బాలకృష్ణ తదితరులు

తాళ్లరేవు: ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన గోవలంక వైఎస్సార్ సీపీ నాయకులు, ఆర్ఎంపీ వైద్యుడు కూరాటి నరసింహమూర్తి కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ పరామర్శించారు. శనివారం నరసింహమూర్తి స్వగృహానికి వెళ్లి ఆయన కుమారుడు వాసు, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ నరసింహమూర్తి మృతి పార్టీకి తీరనిలోటన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వీరివెంట ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి, చంటి, పెయ్యల కొండబాబు, కూరాటి శ్రీకృష్ణ, గుత్తుల శ్రీను, నరసింహమూర్తి, వెంకటరమణ, ప్రేమ్‌కుమార్, రాంబాబు, అప్పారావు, సాగర్, శ్రీరామ్, చిన్నరాజా, సరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు డిజిటల్ సాధికారిత సాధించాలి

తాళ్లరేవు: మహిళలు డిజిటల్ సాధికారితను సాధించాలని భీమాబాయి మహిళా మండలి చీఫ్ ఫంక్షనరీ వాసంశెట్టి నందివర్ధన తెలిపారు. శనివారం జార్జీపేట గ్రామంలో భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలకు యువతులకు సైబర్ దుర్వినియోగం సహనం అనే అంశంపై డిజిటల్ సాధికారిత గురించి వివరించారు. ఈ సందర్భంగా నందివర్ధన మాట్లాడుతూ సైబర్ నేరాలు, సైబర్ దుర్వినియోగం అయ్యే పరిస్థితులను గురించి కూలంకషంగా వివరించారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ లోవరాజు మాట్లాడుతూ మహిళా మండలి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను గురించి వివరించారు. సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

తాళ్లరేవు: గాడిమొగ గ్రామానికి చెందిన యువకుడు సంగాడి హరికృష్ణ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హరికృష్ణ ఈ నెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు కాకినాడ వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అప్పటి నుంచి కనబడడంలేదని అతని సోదరుడు సంగాడి మధుబాబు కోరంగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. హరికృష్ణ మానసిక స్థితి గత ఏడాది కాలంగా బాలేకపోవడంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. హరికృష్ణ ఆచూకీ తెలిసినవారు కాకినాడ రూరల్ సీఐ 9440796521, కోరంగి ఎస్ఐ 9440796558 నబర్లలో గాని తెలియజేయాలని కోరుతున్నారు.